క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: మండలంలోని దాసార్లపల్లెలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలని మంగళవారం తహసీల్దార్ మాధవ రాజుకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి సమీపంలో ప్రభుత్వ స్థలం ఉందని, ఆ స్థలాన్ని అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు కోసం మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ తీర్మానం ప్రకారం స్థలం కేటాయించాలని, గ్రామంలోనే సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పంటలకు బీమా చేసుకోవాలి



పంటను పరిశీలిస్తున్న వెంకటరమణ నాయక్

రొంపిచెర్ల: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వ్యవసాయ పంటలపై బీమా చేసుకోవాలని రొంపిచెర్ల రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ వెంకట రమణనాయక్ అన్నారు. మంగళవారం ఆయన బోడిపాటివారిపల్లెలో వేరుశనగ పంటలను పరిశీలించి పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలు సాగు చేసిన రైతులు క్రాప్ సోన్ సర్టిఫికెట్ తీసుకుని డిసెంబర్ 31లోపు బీమా చేసుకోవాలని తెలిపారు. బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు బీమా అవసరం లేదన్నారు.

విచ్చలవిడిగా గంజాయి!

పలమనేరు నియోజకవర్గంలో గంజాయి అమ్మకాలు ఇటీవల విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఓ వైపు పోలీసులు దాడులు చేసి అక్రమార్కులను అరెస్ట్ చేస్తున్నప్పటికీ అమ్మకాలకు మాత్రం అడ్డుకట్ట పడడం లేదు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గంజాయి వ్యాపారం ఇప్పుడు కొందరికి లాభసాటి ఆదాయ వనరుగా మారింది. విశాఖపట్నం, ఇచ్ఛాపురం చుట్టుపక్కల నుంచి అక్రమంగా జిల్లాకు గంజాయి చేరుతోంది. అక్కడి నుంచి పలు పట్టణాలకు కొందరు గంజాయి తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ గంజాయి వ్యసనానికి యువకులు, విద్యార్థులు చిత్తవుతున్నారు.





- బయటి నుంచి తెచ్చి ఇక్కడ ఏజెంట్లతో విక్రయం
- ఇళ్లు, పొలాల వద్ద గుట్టుగా మొక్కలు పెంచి అమ్మేవారు మరికొందరు
- మత్తుకు చిత్తవుతున్న యువకులు, విద్యార్థులు
- పోలీసుల దాడుల్లో వెలుగు చూస్తున్న వైనం

పలమనేరు: ఐదు రోజుల క్రితం పలమనేరు పోలీసులు పట్టణానికి చెందిన గంజాయి విక్రయించే ఓ కీలక వ్యక్తిని అరెస్ట్ చేసి విచారణ చేశారు. ఇతను చిత్తూరు నుంచి తెచ్చి ఇక్కడ మరికొందరి ఏజెంట్ల ద్వారా ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. దీంతో వారిని పోలీసులు అరెస్ట్ చేసి గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీరు పట్టణంలో పలు ప్రాంతాలతోపాటు గంగవరం మండల కేంద్రం నుంచి బైపాస్ రోడ్డులోని పలు ఆవాస ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్టు తేలడంతో పోలీసులు దీనిపై మరింత నిశితంగా దృష్టి సారించారు.

అనుమానం రాకుండా విక్రయాలు

చిత్తూరు నుంచి తెచ్చి ఇక్కడ గంజాయి అమ్మేవాళ్లు దానిపై లాభం పెట్టుకుని స్థానిక ఏజెంట్లకు ఇస్తున్నారు. వారు మరింత లాభానికి వాటిని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఎంపిక చేసుకున్న రహస్య ప్రదేశాల్లో అమ్మకాలు చేస్తున్నారు. దీనికి అలవాటు పడిన వారిలో యువకులే కాకుండా కళాశాల విద్యార్థులు సైతం ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తం సెల్‌ఫోన్లలో ఈ వ్యాపారం పక్కాగా ఎవరికీ అనుమానం రాకుండా చేస్తున్నట్టు నిందితుల నుంచి పోలీసులు రాబట్టిన సమాచారం ద్వారా తెలియవచ్చింది. గంజాయి వ్యాపారాన్నే కొందరు వృత్తి చేసుకున్నట్టు దీనిని బట్టి తెలుస్తోంది. పోలీస్ యంత్రాంగం కూడా నిందితుల అరెస్ట్‌తోనే సరిపుచ్చకుండా కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంటోంది. గంజాయి వలన కలిగే అనర్థాలు, వాటికి బానిసలై పట్టుబడితే కేసుల మూలాన ఎంతగా నష్టపోతారో విస్తృతంగా చాటి చెప్పాలని స్థానికులు పోలీసు అధికారులను కోరుతున్నారు.

ఇంటి వద్దే గంజాయి సాగు



గంగవరం మండలంలోని సామరాజుపల్లె చెందిన ఓ వ్యక్తి తన ఇంటివద్దే గంజాయి మొక్కలను సాగుచేసి విక్రయాలు చేసేవాడు. దీన్ని పసిగట్టిన గంగవరం పోలీసులు మూడు రోజుల క్రితం నిందితుడిని అరెస్ట్‌చేసి అక్కడున్న మొక్కలను సీజ్ చేశారు. డీఎస్పీ ప్రభాకర్ ఆదేశాలతో అన్నిస్టేషన్ల పరిధిలో గంజాయి కట్టడికి పోలీసులు స్పెషల్ ఫోకస్‌ను పెట్టారని సమాచారం.

హక్కులతోపాటు విధులు తెలుసుకోవాలి

–స్పెషల్ మెజిస్ట్రేట్ రాధమ్మ



మాట్లాడుతున్న జడ్జి రాధమ్మ

పలమనేరు: ప్రజలు తమ హక్కులతో పాటు విధులను తెలుసుకోవాలని స్పెషల్ మెజిస్ట్రేట్ రాధమ్మ సూచించారు. ఆమేరకు స్థానిక కోర్టులో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని పౌరులు ఆదేశిక సూత్రాలు, చట్టాల గురించి అవగాహన చేసుకోవాలని సూచించారు. ఇందులో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇదే కార్యక్రమాన్ని స్థానిక మధు కళాశాలలో ఏపీపీ రంజిత్‌షా ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

మండల సమావేశం రసాభాస

- అధికారుల ఏకపక్ష నిర్ణయాలపై సభ్యులు ధ్వజం
- సమావేశానికి హాజరుకాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

బైరెడ్డిపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. అందుబాటులో ఉన్నా సర్వసభ్య సమావేశానికి కొంత మంది అధికారులు హాజరుకాకపోవడంతో సమస్యలను ఎవరికి చెప్పాలంటూ సభ్యులు ధ్వజమెత్తారు. సమావేశానికి హాజరైతే అధికారులు చేస్తున్న తప్పులు లేవలెత్తి చూపుతారనే ఉద్దేశంతోనే హాజరుకాలేదని మండిపడ్డారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ సర్పంచులను, ఎంపీటీసీలను విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. తీర్థం సమీపంలోని పనలమందమిట్టలో గత ప్రభుత్వంలో బోరు వేసి మోటారును కొనుగోలు చేశామని, అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మోటారును అమర్చి ఎమ్మెల్యే చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభించినా కాలనీ వాసులకు నీరు అందివ్వడం లేదని, తాగునీటికి ఇచ్చే ప్రాధాన్యత ఇదేనా అని ఎంపీటీసీ రవీంద్రమ్మ ఆరోపించారు. గత ప్రభుత్వంలో తీర్థంలో జగనన్న ఇంటి స్థలాలు ఇచ్చి బిల్లులు మంజూరు చేస్తే ఈ కూటమి ప్రభుత్వంలో నాయకులు జేసీబీలతో పునాదులు తవ్వి దౌర్జన్యం చేస్తున్నారని సర్పంచ్ జ్యోతమ్మ చెప్పారు. పేద ప్రజలు అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోలేదని వాపోయారు. ఉపాధి పనుల్లో కూలీలకు పనులు కల్పించడం లేదని, పాతగుంతలకే బిల్లులు పెట్టి దోచుకుతింటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ భాస్కర్‌మొదలి అన్నారు. ఉపాధి పథకంలో మామిడి మొక్కలు నాటినా బిల్లులు మంజూరు చేయడంలేదని మండిపడ్డారు. పట్టుపరిశ్రమశాఖ ద్వారా మంజూరైన షెడ్లకు రూ.25 వేలు లంచం అడుగుతున్నారని వైస్ ఎంపీపీ రూప అధికారులను నిలదీశారు. మండల పరిధిలో మంజూరైన గోకులం షెడ్లకు టీడీపీ నాయకుల అనుమతి కావాలంటూ పశువైద్యాధికారి చెబుతున్నారని ఎంపీటీసీ లక్ష్మమ్మ మండిపడ్డారు. జెడ్పీ నిధుల ద్వారా తాగునీటి సమస్య పరిష్కారం కోసం బోర్లు మంజూరు అయితే గ్రామాల్లో ఎందుకు వేయించలేదని జెడ్పీటీసీ ఆర్.కేశవులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు. వీఆర్‌ఓలను సమావేశానికి వెళ్లకూడదని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని, సమస్యలు ఉన్న రెవెన్యూ అధికారులే రాకపోవడం విడ్డూరంగా ఉందని సర్పంచ్ వెంకటేశ్ పేర్కొన్నారు. వైద్య, విద్య, ఏపీఓ, తహసీల్దార్, ఇరిగేషన్ శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామసభలకు తప్పకుండా ఎంపీటీసీలను, సర్పంచులను ఆహ్వానించాలన్నారు. ఎంపీడీఓ రాజేంద్రబాలాజి పాల్గొన్నారు.

మహిళలపై వేధింపులు తగదు



అవగాహన ర్యాలీలో డ్వాక్రా మహిళలు

సదుం: మహిళలపై వేధింపులు తగదని ఏపీఎం హరిప్రసాద్ సూచించారు. లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా మండల కేంద్రంలో మంగళవారం డ్వాక్రా సంఘాల మహిళలు ర్యాలీ నిర్వహించారు. మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను చూడాలని, బాల్యవివాహాలు అరికట్టాలని ఆయన కోరారు. మహిళలు పనిచేసే చోట వేధింపులకు గురి చేయరాదని, 18 సంవత్సరాల వరకు ఆడపిల్లలకు విద్య అందించాలని సూచించారు. గ్రామాల్లో నెల రోజుల వరకు లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈఓపీఆర్డీ వరప్రసాద్, సీసీలు మధుసూదనరెడ్డి, భానుకుమార్, సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం సస్యశ్యామలం

–జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ



పంటలను పరిశీలిస్తున్న మురళీక్రిష్ణ

గంగవరం: వ్యవసాయ పంటలకు సేంద్రియ విధానం అనుసరించినట్లయితే పంటలు సస్యశ్యామలంగా ఉంటాయని జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ తెలిపారు. మండలంలోని కీలపట్ల, బొమ్మనపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి పుంగనూరు ఏడీఏ శివకుమార్‌తో కలసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రైతులందరూ తమ భూ మట్టి నమూనాలను ఆర్‌ఎస్‌కే సిబ్బందికి తెలియజేసి ముందుగా మట్టి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆ ఫలితాల ఆధారంగా పండించే పంటలకు ఎరువులను వాడినట్లయితే పంట రాబడి పెరుగుతుందన్నారు. అయితే వ్యవసాయ పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం అలవాటు చేసుకోవాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి రైతులు స్వచ్ఛందంగా పంటల బీమా కోసం నమోదు చేసుకోవాలన్నారు. డిసెంబర్ 15వ తేదీలోపు వేరుశనగ, 31వ తేదీలోపు వరి పంటలకు ప్రీమియం చెల్లిస్తేనే పంటల బీమా అందుతుందన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకుని తగిన విధానాలు అనుసరించి పండించే పంటలు సస్యశ్యామలం అవుతాయన్నారు.

అనంతరం పంటలను సందర్శించి ఎరువుల వాడకం గురించి అవగాహన కల్పించారు. ఏఓ హేమలత, పశువైద్యాధికారి ప్రియాంక, పట్టు పరిశ్రమ అధికారి విమల, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన జోనల్ క్రీడా పోటీలు



వాలీబాల్ విన్నర్స్ చౌడేపల్లె బాలుర జట్టు



కబడ్డీ విన్నర్స్ పుదిపట్ల బాలికల జట్టు

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన పుంగనూరు జోనల్ గ్రిగ్ మెమోరియల్ క్రీడాపోటీలు హోరాహోరీగా మంగళవారం ముగిసినట్లు హెచ్ఎం నాగరాజరెడ్డి తెలిపారు. సీనియర్ వాలీబాల్ బాలుర విభాగంలో 16 జట్లు పాల్గొనగా ఫైనల్‌లో చౌడేపల్లె-కందూరు జట్లు తలపడగా చౌడేపల్లె విన్నర్స్, కందూరు రన్నర్స్‌గా విజయం సాధించారు. జూనియర్ బాలుర కబడ్డీ విభాగంలో 17 జట్లు తలపడగా చౌడేపల్లె-పుదిపట్ల తలపడ్డారు. వీరిలో చౌడేపల్లె విన్నర్స్‌గా పుదిపట్ల రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీ సీనియర్ బాలికల విభాగంలో చౌడేపల్లె-పుదిపట్ల తలపడగా పుదిపట్ల విన్నర్స్‌గా, చౌడేపల్లె రన్నర్స్‌గా విజయం సాధించారు. గత రెండురోజులుగా సాగిన జోనల్ స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. పీడీలు వెంకటేష్, రాజేంద్ర, రిటైర్డ్ పీడీ రామచంద్ర పాల్గొన్నారు.

ఏపీఓ అవినీతిపై ఫిర్యాదు



డ్వామా పీడీకి ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో ఏపీఓ హరినాథ్ చేస్తున్న అవినీతిపై ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, వైఎస్సార్‌సీపీ సర్పంచులు, ఎంపీటీసీలు మంగళవారం డ్వామా పీడీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఉపాధి కార్యాలయానికి తనిఖీ నిమిత్తం వచ్చిన డ్వామా పీడీ దృష్టికి ఏపీఓ చేస్తున్న పనులను వివరించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడం లేదన్నారు. యంత్రాలతో పనులు చేస్తున్న వాటికి బిల్లులు పెడుతూ అవినీతికి పాల్పడడం జరుగుతోందన్నారు. ఏపీఓ చేస్తున్న అవినీతి పనులపై విచారణ చేయాలన్నారు. టీడీపీ నాయకులకు ఒత్తాసు పలుకుతూ ఫోర్జరీ పనులు చేస్తున్నాడని, ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం సమంజసం కాదన్నారు. పీడీ మాట్లాడుతూ అడిగిన వారికి పనులు కల్పించే బాధ్యత ఏపీఓదేనన్నారు. పొరపాట్లను సరిచేయడానికే కార్యాలయానికి వచ్చానని, కూలీలకు పనులు కల్పిస్తామని చెప్పారు. అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

చౌడేపల్లెలో ట్రాఫిక్ కష్టాలు



సోమల వెళ్లే రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

చౌడేపల్లె: మండల కేంద్రంలో నిత్యం ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు, ప్రయాణికులు, వాహనాదారులకు అవస్థలు తప్పడంలేదు. ప్రయివేటు బస్టాండు ఆంజనేయస్వామి ఆలయం ఎదుట మంగళవారం దృశ్యమిది. హైస్కూల్‌వీధి, సోమలవైపు వెళ్లే ప్రధాన రహదారిలో సాయంత్రమైతే రోడ్లపై రాకపోకలకు అంతరాయంతో వాహనాలు క్యూకట్టాల్సి వస్తోంది. రోడ్లపై, దుకాణాల ముందు బైక్‌లు పార్కింగ్ చేయడంతో సమస్య తీవ్రమవుతోంది. ట్రాఫిక్‌ను నియంత్రణ చేయడంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడంలేదనే ఆరోపణలున్నాయి. అధికారులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు నివాళి



పుంగనూరులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ఎంపీ రెడ్డెప్ప, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, సీమ జిల్లాల మైనారిటీసెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్‌షరీఫ్, దళిత నాయకులు నాగరాజ, శ్రీనివాసులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ కొన్ని వర్గాలకే పరిమితమైన అధికారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బడుగు,బలహీన వర్గాలకు అందిందని కొనియాడారు. ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించాలన్నారు. వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వైజర్లు మల్లికార్జునరెడ్డి, పి.ఎన్.ఎస్.ప్రకాష్, ఆనంద్‌కుమార్, పార్టీ నేతలు కిజర్‌ఖాన్, జేపీ యాదవ్, నటరాజ, ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, ఇంతియాజ్, రాజేష్, హేమంత్, గోపి పాల్గొన్నారు. అదేవిధంగా కళాశాలలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.

పలమనేరులో..

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డా. వెంకటేశులు, అధ్యాపకులు చిదంబరం, నందీశ్వర, వెంకటేష్‌బాబు, నాగరత్నంరెడ్డి పాల్గొన్నారు.

పెద్దపంజాణి: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పలమనేరు రెవెన్యూ డివిజనల్ అధికారి పి.భవాని అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా నాగిరెడ్డిపల్లి ఎంపీయూపీ పాఠశాలలో హెచ్ఎం బాబురెడ్డి అధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప, ఎంపీడీఓ బాలాజి అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. సర్పంచ్ అరుణ, మాలమహానాడు నేతలు మంజునాథ, అమరనారాయణ, శివప్ప, తిరవలప్ప పాల్గొన్నారు.

సదుంలో..

సదుం: స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జాతీయ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతీయ అంబేడ్కర్ సేన జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ సీతాపతి, కృష్ణయ్య, రాంబాబు, హరినాథ్, నాగరాజు, నరసింహులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పంరూరల్: చందం, టి.సదుమూరు, అడవిబుదుగూరు పాఠశాలల హెచ్ఎంలు మార్కొండ నాయుడు, పద్మనాభరాజు, చిట్టిబాబు రాజ్యాంగ దినోత్సవంగా సందర్భంగా అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అంతకుముందు పాఠశాలల్లో మాక్ పార్లమెంట్ సన్నివేశాలను విద్యార్థులచే ప్రదర్శించారు. చందంలో ఉపాధ్యాయులు మురళి, శాంతమ్మయి, రమేష్, సురేంద్రబాబు, తాజ్‌కాన్, మంజునాథ్,, లాలీదేవి, మాధవి, గాయిత్రి, వరలక్ష్మీ, మహేష్, లోకనాథం పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పాటలు, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. పోటీల్లో రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల, బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు పోటీల్లో గెలుపొంది బహుమతులను సాధించారు. ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, అదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సరళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చందం పాఠశాలలో మాక్ పార్లమెంట్



చౌడేపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో..

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్లో ఘనంగా రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం శ్రీవాణి, ఉపాధ్యాయులు వేణుగోపాల్, వెంకటరమణారెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

గుడుపల్లెలో..

గుడుపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. అంబేడ్కర్‌కు నివాళలర్పించారు. ఎంపీడీఓ రాధాక్రిష్ణన్, ఏఓ బాలక్రిష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ షబ్బీర్ అహ్మద్, ఈఓపీఆర్డీ కృష్ణవేణి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ హనుమంతునాయక్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పెద్దపంజాణి: అంబేడ్కర్‌కు ఆర్డీఓ భవాని నివాళి



అడవిబుదుగూరులో విద్యార్థుల ర్యాలీ



గుడుపల్లెలో..



సదుం: నివాళులర్పిస్తున్న నేతలు



రొంపిచెర్లలో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇస్తున్న ప్రిన్సిపల్



కల్లూరు: ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు